28న గ్రూప్స్ ఉచిత శిక్షణకు స్పాట్ అడ్మిషన్లు

జనగామ చౌరస్తా, మార్చి 26 : గ్రూప్ 1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, ఎస్సై, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కే దయానందరాణి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపికతోపాటు వారికి సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు దయానంద రాణి పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9848503644/ 7093597488లో సంప్రదించాలన్నారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే అభ్యర్థులు డిగ్రీ మెమో, ప్రొవిజనల్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటో, జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని ఆమె సూచించారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

- ఐదో రోజు హాజరైన విద్యార్థుల సంఖ్య 6,691
- ఏడుగురు గైర్హాజరు
- 99.90 శాతం హాజరు నమోదు

జనగామ చౌరస్తా, మార్చి 26 : పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన భౌతిక శాస్త్రం పరీక్షకు 6,698 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 6691 మంది పరీక్ష రాశారు. మిగతా ఏడుగురు గైర్హాజరు అయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కే రాము తెలిపారు. ఐదో రోజు జరిగిన పరీక్షకు 99.90శాతం హాజరు నమోదైనట్లు పేర్కొన్నారు. కొడకండ్ల టీఎస్ రెసిడెన్షియల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్, పాలకుర్తి జడ్పీహెచ్ఎస్ ఏ, బీ సెంటర్లు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఏ, బీ సెంటర్లను డీఈవో రాము పరిశీలించారు. అదేవిధంగా మరో 8పరీక్ష కేంద్రాలను రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. జిల్లాలో భౌతికశాస్త్రం పరీక్ష విజయవంతంగా ముగిసిందని డీఈవో రాము వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.

పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన కవితతోపాటు సభ్యులు

కేశిరెడ్డిపల్లిలో పాఠశాల కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట, మార్చి 26 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని కేశిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు చల్ల కవితను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నవనీత, కవిత, ఎర్రన్న, కవిత, అనిత, లావణ్య, సుజాత, సమత, మాధవి, మణెమ్మ, భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కవిత మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యులతో కలిసి ముందుకెళ్తానన్నారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు.

తులసి కృష్ణవేణి సేవలు మరువలేనివి

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు

బచ్చన్నపేట, మార్చి 26 : సామాజిక సేవలో ముందుండే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తులసి కృష్ణవేణి మృతి విద్యారంగానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. మండలంలోని కొన్నె జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణి అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన సంతాప సభలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెచ్చెట్టి చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. బాధ్యతల నిర్వహణలో తులసి కృష్ణవేణి చురుగ్గా ఉండేవారని, విద్యార్థులకు పాఠాలు బోధించడంతోపాటు సామాజిక సేవలో ముందుండేవారని తెలిపారు. ఆమె మనందరికీ దూరం కావడం బాధాకరమన్నారు. ఇదిలా ఉండగా ఆమె అంత్యక్రియలు హైదరాబాద్‌లో నిర్వహించగా ఉపాధ్యాయులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడబ్ల్యూ జిల్లా కన్వీనర్ కృష్ణ, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి కృష్ణమూర్తి, గొట్టె కనుకయ్య, సభ్యులు శ్రీధర్, యాదగిరి, లలిత, సులోచన, శేఖర్, నిరంజని, శ్రీదేవి, లక్ష్మి, నర్సమ్మ, అన్నపూర్ణ, షరత్కల తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ : పోచమ్మ తల్లి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న సాగరం గ్రామస్తులు

చిల్పూరులోని రేణుకాఎల్లమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న భక్తులు

వైభవంగా గ్రామ దేవతల పండుగ

- సాగరంలో పోచమ్మ, దుర్గామాత వేడుకలు
- చిల్పూరులో రేణుకాఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

చిల్పూరులో ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న భక్తులు

జఫర్‌గఢ్/చిల్పూరు, మార్చి 26 : జఫర్‌గఢ్, చిల్పూరు మండలాల్లో గ్రామ దేవతల పండుగలు ఘనంగా జరిగాయి. జఫర్‌గఢ్ మండలం సాగరంలో గ్రామ దేవతలకు మంగళవారం పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోచమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హోమాలు నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం ఆడబిడ్డలు అమ్మవార్ల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఉత్సవమూర్తులను గ్రామంలోని వీధుల్లో డప్పు చప్పుళ్లతో ట్రాక్టర్‌పై ఊరేగించారు. పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు అమ్మవార్లకు బోనాలు సమర్పించే వేడుకలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు విలేకరులకు తెలిపారు. మరోవైపు అమ్మవార్ల వేడుకలను పురస్కరించుకుని బంధుమిత్రుల రాకతో సాగరంలో పండుగ వాతావరణం నెలకొంది.

చిల్పూరులో పుట్టల ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

చిల్పూరు మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం పుట్టల ఎల్లమ్మ విగ్రహాన్ని గౌడ కులస్తులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మోడం విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రేణుకాఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించామన్నారు. ఆలయానికి స్థానికులు మాచర్ల సందీప్-చందన, నారగోని రవి చంద్ర-గాయత్రి దంపతులు ఎల్లమ్మ విగ్రహాన్ని బహూకరించారని ఆయన వివరించారు. గ్రామంలోని గౌడ కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్వర్, గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీను, ఉపాధ్యక్షుడు గనగోని వెంకటేశ్వర్లు, గౌడ సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేశ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు నారగోని రాజుగౌడ్, నాయకులు పంతం రాజు, రాములు, లింగయ్య, శ్రీనివాస్, డిష్ వెంకన్న, స్వామి, సంపత్ పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ నర్సయ్య

గిర్నితండా వద్ద వాహనాల తనిఖీ

కొడకండ్ల, మార్చి 26 : మండలంలోని మొండ్రాయి శివారు గిర్నితండా ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం ఏసీపీ అంబాల నర్సయ్య నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఎన్నికల బందోబస్తులో భాగంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. జనగామ-సూర్యాపేట హైవేపై వెళ్లే వాహనాలను పోలీసులు పరిశీలించి తనిఖీలు కొనసాగించారు. కార్యక్రమంలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు, సీఆర్‌పీఎఫ్ 39వ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా బండ రమేశ్

లింగాలఘనపురం, మార్చి 26 : కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని పటేలుగూడేనికి చెందిన బండ రమేశ్‌ను నియమించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర మంగళవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా బండ రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. నాయకులు లింగాల జగదీశ్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, లొక్కుంట్ల ప్రవీణ్, బూడిద సదానందం, బిట్ల బాబు, నీలం మోహన్, ఏలె మూర్తి, సాదం విజయమనోహర్, శ్రీలతారెడ్డి, రాజరవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, మార్చి 26 : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎమ్మార్ లక్ష్యం, వేసవిలో తాగునీటి ప్రణాళికపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన సీఎమ్మార్ లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనాతో 200 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తొలుత మండలానికి ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం రాబడులను పరిగణలోకి తీసుకున్నాక అవసరాలకు తగినట్లు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. సెంటర్ నిర్వాహకులకు అవసరమైన శిక్షణ ఇస్తామని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. బోర్లు, చేతి పంపుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో మొగులప్ప, పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ప్రసాద్, డీపీవో రంగాచారి, డీఏవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్..

పార్లమెంట్ ఎన్నికలకు నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్‌బాషా చేపట్టారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి 2945 మంది సిబ్బందిని కేటాయించారు. పోలింగ్ కేంద్రాలకు తగినట్లుగా అదనపు సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్ కుమార్, సీపీవో ఇస్మాయిల్, రాంప్రసాద్, దుర్గారావు, ఏవో రవిందర్, ఎన్నికల సెక్షన్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

జఫర్‌గఢ్, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగులు, వయోవృద్ధుల ఓటరు నమోదుపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి మండలంలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు హాజరుకాగా తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు, 85ఏళ్లు పైబడిన వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగంచుకునేందుకు ఫారం-12 డీ పూర్తి చేసి ఇవ్వాలన్నారు. బీఎల్‌వోలు దివ్యాంగులు, వయోవృద్ధుల వద్దకు వెళ్లి ఫారాన్ని నింపి పంపిస్తే రిటర్నింగ్ ఆఫీసర్ నమోదు చేస్తారని ఆయన వివరించారు. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్‌బాబు, ఆయా గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, మార్చి 26 : నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలనే ఆలోచనతో ఓ కానిస్టేబుల్ వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన విరాళాలను మంగళవారం అందించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బమ్మెరకు చెందిన పసుల శ్యామల అనారోగ్యంతో ఫిబ్రవరిలో మృతి చెందారు. ఆమెకు కూతురు జాన్విక(4), కుమారుడు(11 నెలలు) ఉన్నారు. పేదరికంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారి కుటుంబానికి చేయూతనివ్వాలనే ధ్యేయంతో గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పెంతల అశోక్ విలేజ్‌కు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో ఆర్థిక సాయానికి విజ్ఞప్తి చేస్తూ పోస్టులు పెట్టారు. స్పందించిన గ్రామస్తులు రూ.40,131 విరాళాలు అందించారు. వీటిని జాన్విక పేరున బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ చేయించి వారి కుటుంబానికి మంగళవారం బాండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దార శంకరయ్య, దేవసాని నరేశ్, మారం రవికుమార్, జోగు గోపి, చినూరి సోమయ్య, కళ్లెం నరసింహులు, జున్ను సంపత్, బోయిని యాకయ్య, జంపాల అనిల్, మేడిద ప్రశాంత్, దొంతరబోయిన ఉప్పలయ్య, ఎల్లస్వామి, దేవసాని ఉపేందర్ పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందిస్తున్న పెంతల అశోక్

నాణ్యమైన విద్యపై ప్రత్యేక ఫోకస్ : ఐటీడీఏ పీవో

ఏటూరునాగారం, మార్చి 26 : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు, నాణ్యమైన విద్యపై ప్రత్యేక ఫోకస్ పెట్టనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా తెలిపారు. మంగళవారం తనను కలిసిన విలేకరులతో ఆమె పలు అంశాలపై చర్చించారు. ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా ఉపాధ్యాయులకు టీచింగ్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు కంప్యూటర్లు, ల్యాబ్‌లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. పాఠశాలల పర్యవేక్షణ, సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఏఎన్ఎంల ద్వారా ప్రత్యేక దృష్టి పెట్టి హెల్త్ రికార్డులు తయారు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా గిరిజనులకు ప్రత్యేక వైద్యం అందించేందుకు ప్రస్తుతం ఉన్న వైద్యశాలలు, సబ్ సెంటర్ల పని తీరు మెరుగు పర్చనున్నట్లు తెలిపారు. ఏటూరునాగారం సీహెచ్‌సీలో వైద్యుల కొరతను విలేకరులు పీవో దృష్టికి తీసుకపోగా ఇక్కడ సేవలందించేందుకు ముందుకు వచ్చే వారికి అవకాశం కల్పిస్తామన్నారు.

రేపు చిల్పూరు ఆలయ హుండీల లెక్కింపు

చిల్పూరు, మార్చి 26 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీలను ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీల్లోని కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు.

సేవాదళ్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కర్నె అశోక్

రఘునాథపల్లి, మార్చి 26 : కాంగ్రెస్ సేవాదళ్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని జాఫర్‌గూడేనికి చెందిన కర్నె అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మంగళవారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, జిల్లా,మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా వెంకటయ్య

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : కేయూ పొలిటికల్ సైన్సు విభాగం నూతన ఇన్‌చార్జి, విభాగాధిపతిగా పొలిటికల్ సైన్స్ ఒప్పంద అధ్యాపకుడు వెంకటయ్యను నియమిస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నరసింహచారి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటయ్య 2004వ సంవత్సరంలో పొలిటికల్ సైన్సు విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్‌గా ప్రవేశించారు. 2009లో ఒప్పంద అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. ఆయన వివిధ జాతీయ సదస్సుల్లో 12పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. 27న వీరస్వామి నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.

రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పీ విజయచందర్‌రెడ్డి, కేయూ వీసీ రమేశ్, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి

రక్తదానం ప్రాణదానంతో సమానం

కేయూ వీసీ తాటికొండ రమేశ్

హనుమకొండ, మార్చి 26 : రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి హాజరై రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం సామాజిక సేవా కార్యక్రమంగా భావించి తలసేమియా బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, చందూలాల్, శ్రీనివాస్, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై సమీక్షిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

తాగునీటి వృథాను అరికట్టాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 26 : తాగునీటి వృథాను అరికట్టాలని, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులపై దృష్టి సారించాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్‌లో తాగునీటి సరఫరాపై ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలోని చివరి ఇంటి వరకు తాగునీటి సరఫరా జరుగాలన్నారు. ట్రయల్ అండ్ ఎర్రర్‌లో భాగంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. కొత్త ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం పైప్‌లైన్‌లకు వాల్వ్ బిగించాలని సూచించారు. పాత పైప్‌లైన్ ఉన్న ప్రాంతాల్లో నీటి ప్రెషర్ వల్ల, రోడ్ల తవ్వకాల వల్ల లీకేజీలు ఏర్పడుతున్నాయని ఇంజినీర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, వరంగల్, హనుమకొండలోని ప్రధాన కూడళ్లలో 25చొప్పున చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు బీఎల్ శ్రీనివాసరావు, రాజయ్య, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈలు సారంగం, రవికిరణ్, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

టీఎస్ బీపాస్ నిబంధనలు పాటించాలి..

భవన నిర్మాణదారులు టీఎస్ బీపాస్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కమిషనర్ అశ్విని తానాజీ అన్నారు. నగరంలోని ఆకుతోట కన్వెన్షన్ హాల్, వాల్ మార్ట్, పాతబీటు బజార్ ప్రాంతాల్లో నిర్మించే భవనాల స్థలాలను పరిశీలించారు. టీఎస్ బీపాస్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని, 33జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని లేఖ ద్వారా కోరారు. గత ప్రభుత్వంలో టెట్ ఒక పేపరు దరఖాస్తు ఫీజు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఉండేదని, ప్రస్తుత పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్లకు రూ.2,000 పెంచడం సరికాదన్నారు. ఏడు లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిగణనలోకి తీసుకుని టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళపై దాడి చేసిన ఐదుగురిపై కేసు

పరకాల, మార్చి 26 : ఇంటి స్థలం వివాదంలో బంధువులు మహిళపై దాడి చేసిన ఘటన నాగారంలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమ్మ రాజమ్మ భర్త గతంలో మృతి చెందాడు. తన ఇద్దరు కూతుళ్లకు వివాహాలు జరుగడంతో ఒంటరిగా ఉంటుంది. ఇంటి స్థలం విషయంలో బంధువులతో తరుచూ గొడవలు జరుగుతుండేవి. కాగా, సోమవారం రాత్రి అమ్మ రవి, రాజు, సునీత, ప్రమీల, రజిత ఇంట్లోకి చొరబడి రాజమ్మపై దాడి చేశారు. స్థానికులు గాయపడిన రాజమ్మను ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రాజమ్మ కుమార్తె యార రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

కాజీపేట రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి

కాజీపేట, మార్చి 26: కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై లిఫ్ట్ వద్ద గుర్తు తెలియని ప్రయాణికుడు పడుకుని నిద్రలోనే చనిపోయాడు. అతడి జేబులో కల్యాణ్ రైల్వే జంక్షన్ నుంచి కాజీపేటకు తీసుకున్న రైలు టికెట్ లభించిందని చెప్పారు. ఈ మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడి సంబంధీకులు 8712658609, 9949859108 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో

వృద్ధుడి మృతి

జనగామరూరల్, మార్చి 26 : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని శామీర్‌పేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన జక్కుల కొమురయ్య(60) సోమవారం కిరాణం షాపునకు వెళ్లి వస్తూ రోడ్డు దాటుతుండగా పసరమడ్ల నుంచి జనగామకు పల్సర్ బైక్‌పై వెళ్తున్న రాగుల ప్రశాంత్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో కొమురయ్య తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108వాహనంలో జనగామలోని ఏరియా దవాఖానాకు తరలించారు. చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో కొమురయ్య మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి కుమార్తె కవిత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★HNK లగ్జరీ ఎంటర్ ప్రైజెస్ వెయ్యి స్తంభాల గుడి ప్రక్కన Air Coolor & ఫర్నిచర్ షాపులో పని చేయడానికి సెల్స్ గర్ల్స్, సెల్స్ బాయ్స్, సూపర్ వైజర్, హెల్పర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర:9347881523.
NTW-321500

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న ల